సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 17 । ఆగస్టు । 2023



క్రీడల్లో మంచిపేరు

వనపర్తికి క్రీడల్లో మంచి పేరు ఉందని మంత్రి నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

వివరాలు 8లో ▸



ఆధ్యాత్మిక శోభ

జడ్చర్ల అయిత చండీ అతిరుద్రం విశ్వశాంతి మహోత్సవంలో ఆధ్యాత్మిక వెల్లివిరుస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /22.1

వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

పురస్కారాలకు ప్రతిపాదనలు

కందనూలు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఈ నెల 25లోగా సంబంధిత ఎంఈఓల ద్వారా ప్రతిపాదనలు పంపాలని డీఈఓ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంలు 15 ఏళ్లు, ఉపాధ్యాయులకు పదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి సెల్ నం.99899 21105ను సంప్రదించాలని సూచించారు. గడువులోగా వచ్చిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

గాంధీ చిత్ర వీక్షణకు ఆసక్తి



కందనూలు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శిస్తున్న గాంధీ సినిమాను వీక్షించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు ఉచితంగా వీక్షించేలా జిల్లాలోని 7 థియేటర్లను అందుబాటులోకి తీసుకున్నామని, **ఈ నెల 24** వరకు ఆయా థియేటర్లలో **చిత్ర ప్రదర్శన** కొనసాగుతుందని డీఈఓ **గోవిందరాజులు** తెలిపారు. బుధవారం **జిల్లాకేంద్రంలోని** రామకృష్ణ థియేటర్లలో **గాంధీ చిత్రాన్ని** ప్రదర్శించగా.. వివిధ పాఠ**శాలల విద్యార్థు**లతో కలిసి డీఈఓ వీక్షిం**చారు. అనంతరం** ఆయన మాట్లాడుతూ గాంధీ **సినిమాను అన్ని** పాఠశాలల విద్యార్థులు వీక్షిం**చేలా ఉపాధ్యా**యులు చొరవ తీసుకోవాల**ని సూచించారు.** జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లోని థియేటర్లలో రోజుకు 5,483 మంది విద్యార్థులు బుధవారం సినిమాను వీక్షించారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచితంగా చిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు. రానున్న వారం రోజుల్లో విద్యార్థులు అందరూ వీక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు.

దరఖాస్తుల స్వీకరణ

కోడేరు: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవర్ బేస్డ్ పద్ధతిలో టీజీటీలో మ్యాథ్స్ 1, హిందీ 2, పీజీటీ మ్యాథ్స్ 1, కెమిస్ట్రీ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, డిగ్రీతోపాటు బీఈడీ అర్హత కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు గురువారం నుంచి శనివారం వరకు సంబంధిత సర్టిఫికెట్లతోపాటు బయోడెటా కళాశాలలో ఇవ్వాలని సూచించారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. పాత కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలు చేపట్టిన రిలే దీక్షలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో గ్రామాల్లో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారిని పర్మనెంట్ చేయకపోవడం దుర్మార్గం అన్నారు. వారితో అన్నిరకాల పనులు చేయిస్తూ, 32 రకాల రికార్డులను రాయిస్తూ, 24 గంటలు పనిచేయించుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తక్షణమే వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రామయ్య, సుగుణ, కృష్ణవేణి, పరిమళ, రాజేశ్వరి, కళావతి, సునీత పాల్గొన్నారు.

మరోసారి విభేదాలు బహిర్గతం

- వనపర్తిలో చిన్నారెడ్డి వర్సెస్ **శివసేనారెడ్డి**
- పరిశీలకుల ఎదుటే ఇరువర్గాల కుమ్ములాట
- గద్వాలలో సైతం మాటల **యుద్ధం**
- పాత, కొత్త నేతల మధ్య కు**దరని సయోధ్య**
- కొల్లాపూర్, నాగర్‌కర్నూల్**లో** సైతం చిచ్చురేపిన చేరికలు



హస్తం.. అదే సిత్రం!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పోరుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్‌లో గ్రూప్ తగాదాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈసారి విజయం ఖాయమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని హస్తం అగ్రనేతలు చేస్తున్న సూచనలు మాటలుగానే మిగులుతున్నాయి. వనపర్తి, గద్వాల జిల్లాకేంద్రాల్లో బుధవారం చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. బూత్ లెవల్‌లో పార్టీ పరిస్థితిని అంచనా వేసేందుకు పరిశీలకుల సమక్షంలో నిర్వహించిన సమావేశాల్లో నేతల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఇరువర్గాల మాటల తూటాలు, కుమ్ములాటలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాత–కొత్త నేతల మధ్య సయోధ్య కుదరకపోవడంతో.. వారిని సముదాయించలేక అబ్జర్వర్లు తలపట్టుకున్నారు.

వనపర్తిలో తోపులాట



వనపర్తిలో చిన్నారెడ్డి, శివసేనారెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం

వనపర్తి జిల్లాలో మాజీ మంత్రి, కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి అనుచరులు, యువజన కాంగ్రెస్ నాయకుల మధ్య మొదటి నుంచీ వార్ నడుస్తోంది. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న ఘటనలు ఇదివరకే ఉన్నాయి. తాజాగా జిల్లాకేంద్రంలో వనపర్తి శాసనసభ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించగా.. కాంగ్రెస్ కేంద్ర కమిటీ నుంచి అబ్జర్వర్‌గా పీవీ మోహన్‌తో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ క్రమంలో మండల తదితర కమిటీల్లో ప్రాతినిధ్యం తెరపైకి వచ్చింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడి ఉన్న తన మండలంలో ఇది వరకే ఏర్పాటు చేసిన యువజన కమిటీ ఉండగా.. తనకు తెలియకుండా చిన్నారెడ్డి మరో కమిటీని ఏర్పాటు చేయడంపై శివసేనారెడ్డి ప్రశ్నించడంతో వాగ్వాదం మొదలు కాగా.. తీవ్ర స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. అదే సమయంలో తమ మండలంలోని కమిటీల్లో కూడా తమకు ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని ఇటీవల పార్టీలో చేరిన మేఘారెడ్డి వర్గీయులు సైతం ప్రశ్నించడంతో వాగ్వాదం మరింత పెరిగింది. చిన్నారెడ్డి ఒంటెద్దు పోకడలు అవలంబిస్తున్నారని.. నియోజకవర్గవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కమిటీలను తన ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకున్నారని యూత్ కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగగా.. చిన్నారెడ్డి అనుచరులు అడ్డు తగిలి, జై చిన్నా అంటూ నినాదాలు చేయడంతో తోపులాట చోటుచేసుకుంది. బాహాబాహీకి దిగిన ఇరువర్గాలు నినాదాలతో హోరెత్తించడంతో.. వారిని మల్లురవి సముదాయించి పంపించి వేయడంతో పాటు సమావేశం వాయిదా వేశారు.

గద్వాలలో మాటకు మాట..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సమావేశం హాట్‌హాట్‌గా సాగింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిశీలకుడు మోహన్, మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి తదితరులు హాజరు కాగా.. ఆ పార్టీ నాయకుడు, అధికార ప్రతినిధి కుర్వ విజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు దుమారం లేపాయి. కష్టపడి పనిచేసే వాళ్లకే ప్రాధాన్యం ఇవ్వాలని, పార్టీకి క్రమశిక్షణ ఉందని.. ఒంటెద్దు పోకడలకు పోతూ పాత నాయకులు, డీసీసీ అధ్యక్షులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, తగిన బుద్ధి చెబుతామంటూ ఉద్వేగంగా మాట్లాడారు. 15 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నామని.. నిన్న, మొన్న వచ్చిన నాయకులు తామే ఎమ్మెల్యే అభ్యర్థులమంటూ ఏకపక్షంగా ప్రచారం చేసుకుంటున్నారని.. పరోక్షంగా బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ సరితనుద్దేశించి మాట్లాడారు. దీనిపై సరిత సైతం దీటుగా స్పందించింది. ప్రతిసారి పాత వాళ్లం అని చెప్పే నాయకులు పార్టీని ఎందుకు బలోపేతం చేయలేకపోయారు.. తాము కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో తిరుగుతూ పెద్ద ఎత్తున అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను పార్టీలో చేర్పిస్తూ బలోపేతం చేస్తున్నామని.. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించమని.. పార్టీ ఆదేశాల మేరకే పని చేస్తామని.. తామే ఎమ్మెల్యే అభ్యర్థులమని ఎక్కడా అనలేదని చెప్పారు.

భగ్గుమంటున్న చేరికల చిచ్చు..

హస్తంలో ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ శ్రేణుల మధ్య కొరవడిన సఖ్యత.. ఇటీవల చేరికల సందర్భంగా రేగిన చిచ్చు కుదిపేస్తున్నట్లు వనపర్తి, గద్వాలలో చోటుచేసుకున్న ఘటనలు బహిర్గతం చేస్తున్నాయి. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో సైతం ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు పీవీ మోహన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో ఇటీవల జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో జగదీశ్‌రావు, కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. అదే విధంగా నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి, ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కుమారుడు రాజేష్ రెడ్డి ఎడమొహం, పెడమొహంగా ఉంటున్నారు. ప్రధానంగా కాంగ్'రేసు'లో చేరికల చిచ్చు రాజుకోగా.. అభ్యర్థిత్వాలపై పోరు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. దీంతో హస్తం శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. పార్టీ అధిష్టానం ఇప్పటికైనా దృష్టి సారించి పాత–కొత్త నేతల మధ్య సయోధ్య కుదిర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వడివడిగా అడుగులు

అచ్చంపేట ఎత్తిపోతలకు టెండర్ నోటిఫికేషన్ జారీ

- రూ.1,061 కోట్ల వ్యయంతో మొదటి దశ పనులు
- రూ.1,534.5 కోట్లతో గతంలోనే పరిపాలన అనుమతులు
- 'పాలమూరు' పరిధిలోని ఏదుల రిజర్వాయర్ నుంచి తరలింపు
- అందుబాటులోకి వస్తే 57,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు



అచ్చంపేట ఎత్తిపోతల ప్రతిపాదిత మ్యాప్

అచ్చంపేట: నల్లమల ప్రాంతంలోని బీడుభూములకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవడానికి చకచకా అడుగులు పడుతున్నాయి. పాలమూరు–రంగారెడ్డిలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి అచ్చంపేట ఎత్తిపోతల పథకం కింద రెండు దశల్లో లిఫ్ట్ పనులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తొలిదశ పనులకు రూ.1,061.39 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు నీటిపారుదల శాఖ ఈ నెల 9న టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2021 ఏప్రిల్‌లో నీటిపారుదల శాఖ అచ్చంపేట ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలు చేపట్టగా.. అప్పట్లోనే సర్వే పనులు పూర్తిచేశారు. రూ.1,534.5 కోట్ల అంచనా వ్యయంతో అచ్చంపేట ఎత్తిపోతల తొలిదశ పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు ఇస్తూ.. మే 3న రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇందులోనే ప్రాజెక్టు నిర్మాణ వ్యయంతోపాటు 4,142 ఎకరాల భూసేకరణ వ్యయం ఉంది. 2018 ఎన్నికల బహిరంగ సభకు వచ్చిన సీఎం కేసీఆర్ ఎంపీ రాములు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విన్నపం మేరకు నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మాటిచ్చారు. ఆ హామీ మేరకు త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

5.7 టీఎంసీల నీటిని తరలించి..

అత్యంత ఎత్తు ప్రాంతాలైన ఐదు మండలాలకు సాగునీరు అందించేలా రెండు దశల్లో నీటిని ఎత్తిపోసేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఖరారైన అలైన్‌మెంట్ ప్రకారం ఏదుల రిజర్వాయర్ నుంచి కొత్తగా నిర్మించనున్న అచ్చంపేట ఎత్తిపోతల పథకంలోని ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు 5.7 టీఎంసీల నీటిని తరలించనున్నారు. అక్కడి నుంచి కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా అచ్చంపేట, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, తెలకపల్లి మండలాల్లోని 61 గ్రామాలకు 57,200 ఎకరాల ఆయకట్టుకు సాగు, తాగునీరు అందించనున్నారు.

సాగునీరు అందే మండలాలు, ఆయకట్టు వివరాలు

మండలాలు	ఆయకట్టు (ఎకరాల్లో)
అచ్చంపేట	29,328
బల్మూర్	18,122
లింగాల	4,873
ఉప్పునుంతల	1,128
తెలకపల్లి	3,749

తొలిదశ ఎత్తిపోతల పనుల ప్రతిపాదనల వివరాలు

శ్రీఉమామహేశ్వర రిజర్వాయర్ కొండనాగుల, బల్మూరు, మైలారం మధ్య 2.67 టీఎంసీ సామర్థ్యం	మొత్తం కాల్వలు 4
రాంపూర్ కెనాల్ 14.3 కి.మీ.,	ఆయకట్టు 16,400 ఎకరాలు
రంగాపూర్ కెనాల్ 21.4 కి.మీ.,	ఆయకట్టు 3,500 ఎకరాలు

సీఎంతో శంకుస్థాపన



అచ్చంపేట నియోజకవర్గంలో సాగునీటి అవసరంపై పలు సందర్భాల్లో సీఎం కేసీఆర్ దృష్టికి తీసికెళ్లడంతో స్పందించి ఎత్తిపోతల పథకాలకు అనుమతించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే.. సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభిస్తాం. నల్లమల ప్రాంతం పచ్చని పైర్లతో కనిపించేలా కృషి చేయడమే లక్ష్యం. ఈ ప్రాంత ప్రజలు, రైతుల చిరకాల కోరిక నెరవేర్చడం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నా. ఈ ప్రాజెక్టు పనులు చేపట్టి విమర్శించే వారి నోరు మూయిస్తాం.

– గువ్వల బాలరాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, అచ్చంపేట

స్టేజ్–2 టెండర్ వస్తోంది..



త్వరలోనే అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించే రెండోదశ ఎత్తిపోతల పథకం టెండర్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. తొలిదశ టెండర్ ప్రక్రియ ముగిస్తే 15 రోజుల్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు త్వరలో పైలాన్ ఏర్పాటు చేస్తాం.

– సత్యనారాయణగౌడ్, డీఈ, నీటి పారుదలశాఖ

ఏదుల నుంచి..

ఏదుల రిజర్వాయర్ (వెన్నచర్ల) నుంచి 29 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ ద్వారా.. లింగాల మండలం సూరాపూర్‌కు నీటిని తరలిస్తారు. ఇక్కడ ఏర్పాటు చేసే ఫోర్‌బే పంపుహౌస్ వద్ద 83 మీటర్ల ఎత్తున 8 మెగావాట్ల సామర్థ్యం ఉన్న నాలుగు మోటార్ల ద్వారా ఒక్కొక్క పంపు 250 క్యూసెక్కుల నీటిని 91 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తోంది. 2.6 డైయా మీటర్ల సామర్థ్యం ఉన్న రెండు పైపుల ద్వారా 9 కిలోమీటర్ల పొడవున ప్రైజర్ మెయిన్ డెలివరీ సిస్టం ద్వారా మైలారం వద్ద నిర్మించే శ్రీఉమామహేశ్వర రిజర్వాయర్‌కు తరలిస్తారు. ప్రతిరోజు 0.1 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తూ.. 90 రోజుల పాటు 5.7 టీఎంసీలు తరలించేలా ఈ పథకం రూపకల్పన చేశారు.

ఓటరు నమోదుపై అవగాహన సదస్సులు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా ఓటుహక్కుపై చైతన్య కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూ.. అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కొత్త ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. మండల స్థాయిలోనూ స్వీప్ యాక్టివిటీ పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఇంటింటికి వెళ్లి 18– 19 ఏళ్ల వయస్సున్న వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోలేని వారు ఉన్నారా.. అనేది తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేలా ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఈఓ గోవిందరాజులు, స్వీప్ నోడల్ ఆఫీసర్ రామ్మోహన్, సెక్షన్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది రెండురోజులే..



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని 67 మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేయడానికి గడువు రెండురోజులు మాత్రమే మిగిలి ఉండటంతో బుధవారం జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం వ్యాపారులతో కిటకిటలాడింది. మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫయాజుద్దీన్ పర్యవేక్షించారు. జిల్లాలోని 67 మద్యం దుకాణాలకు గాను బుధవారం 179 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 56 దరఖాస్తులు, కొల్లాపూర్ స్టేషన్ పరిధిలో 9, తెలకపల్లి స్టేషన్ పరిధిలో 20, కల్వకుర్తి స్టేషన్ పరిధిలో 84, అచ్చంపేట స్టేషన్ పరిధిలో 10 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు 589 దరఖాస్తులు వచ్చాయని ఈ నెల 18 చివరి తేదీ ఉండటంతో భారీ మొత్తంలో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అయితే కొల్లాపూర్ పరిధిలో ఒక మద్యం దుకాణం, అచ్చంపేట పరిధిలో ఒక మద్యం దుకాణానికి దరఖాస్తులే రాకపోవడం గమనార్హం.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

కందనూలు: మధ్యంతర భృతి ప్రకటించడంతోపాటు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగులు అనేక దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో భాగమైన సీపీఎస్ రద్దు చేసి, తక్షణమే ఓపీఎస్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే బదిలీలు, పదోన్నతులపై శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసి, కోర్టులో ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్స్, సరెండర్ లీవ్స్, టీఎస్‌జీఎల్‌ఐ తదితర చెల్లింపులు జరిగేలా చూడటంతోపాటు పీఆర్సీ కమిటీ వేసి ఐఅర్ 20 శాతం తగ్గకుండా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ముద్ఖేడ్–డోన్ రైల్వే డబ్లింగ్‌కు ఆమోదం

- ఈ లైన్‌తో ఉమ్మడి జిల్లాకు వెసులుబాటు
- ఇప్పటికే మహబూబ్‌నగర్ వరకు పూర్తయిన డబ్లింగ్‌లైన్
- మహబూబూబ్‌నగర్–డోన్ వరకు విద్యుద్దీకరణ పూర్తి



మహబూబ్‌నగర్–డోన్ మధ్య పూర్తయిన విద్యుద్దీకరణ లైన్

స్టేషన్ మహబూబ్‌నగర్: ముద్ఖేడ్–డోన్ వరకు రైల్వే డబ్లింగ్ లైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ వివరాలు వెల్లడించారు. ముద్ఖేడ్–డోన్ సెక్షన్‌లో రూ.4,686.09 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన 417.88 కిలోమీటర్ల డబ్లింగ్ తక్షణ ప్రాజెక్టుకు రైల్వే మంత్రిత్వశాఖ ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ రైల్వే లైన్ పూర్తయితే ఉమ్మడి జిల్లా ప్రయాణికులతో పాటు ఆర్థిక, వ్యాపారపరంగా ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్‌లైన్ పూర్తి..

ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు 85 కిలోమీటర్ల డబ్లింగ్ రైల్వేలైన్ పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టు కింద సెక్షన్ల వారీగా స్టేషన్‌కు స్టేషన్ మధ్య డబ్లింగ్‌లైన్ పనులను చురుగ్గా చేపట్టి పూర్తి చేశారు. అదే విధంగా విద్యుద్దీకరణ పనులను పూర్తి చేశారు. దీంతో ఈ దారి గుండా రైళ్ల వేగం మరింత పెరిగింది. మహబూబ్‌నగర్–గద్వాల మధ్య 72.7 కిలోమీటర్ల విద్యుద్దీకరణ లైన్ పూర్తి చేసి డోన్ వరకు కూడా ఇటీవలే పూర్తి చేశారు. ఇప్పుడు డోన్ వరకు రైల్వే డబ్లింగ్‌కు పచ్చజెండా ఊపారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల మీదుగా వెళ్తుంది. ముద్ఖేడ్–డోన్ వరకు డబ్లింగ్ లైన్‌తో సరుకు రవాణాకు మెరుగైన సౌకర్యం ఏర్పడుతుంది. అదేవిధంగా ఈ సెక్షన్ డబ్లింగ్ చేయడం వల్ల రద్దీని తగ్గించడంలో సాయపడుతుంది. రాయచూర్–దేవరకద్ర, కొడంగల్–మహబూబ్‌నగర్‌లకు ఆర్థిక కారిడార్లు, జడ్చర్ల, మహబూబ్‌నగర్ పట్టణాల వరకు ఆహార ధాన్యాల సరఫరాకు మరింత వెసులుబాటు లభిస్తుంది. ఇండస్ట్రీయల్ క్లస్టర్‌కు గద్వాల, ఇటిక్యాలలో ఏర్పాటుతోపాటు సరుకు రవాణా కోసం మహబూబ్‌నగర్, గద్వాలలో గిడ్డంగులు, శీతల గిడ్డంగుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది.

ప్రాణాలు తీసిన ఫాంపాండ్

- ఆడుకుంటూ వెళ్లి.. నీటిలో పడిన చిన్నారి
- కుమార్తెను కాపాడేందుకు ప్రయత్నించిన తల్లి
- ఈత రాక ఇద్దరు నీటిలో మునిగి మృత్యువాత
- జడ్చర్ల మండలం గొల్లపల్లి శివారులో ఘటన

– జడ్చర్ల



– వివరాలు 8లో

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ, అప్పాజిపల్లికి చెందిన లైన్‌మన్ ముడావత్ చందునాయక్ (25) బుధవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణ్‌నాయక్‌తండా పంచాయతీ పరిధిలోని తువ్వబండతండాకు చెందిన చందునాయక్ మూడేళ్లుగా లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గుమ్మకొండలో విద్యుత్ అంతరాయం తొలగించడానికి స్తంభం ఎక్కి తీగలు సరి చేస్తుండగా ప్రమాదశావత్తు విద్యుత్ సరఫరా అయ్యి షాక్ తగిలి కింద పడ్డాడు. గమనించిన సిబ్బంది, స్థానికులు హుటాహుటిని జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గ మధ్యలోనే మరణించాడు. ఈ ప్రమాదం తప్పుడు ఎల్‌సీ కారణంగా అయ్యిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న డీఈ శ్రీధర్‌శెట్టి చందునాయక్ మృతదేహాన్ని పరిశీలించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్ధి ట్రాన్స్‌కో తరపున అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి విద్యార్థి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి బాలుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా.. జిల్లా కేంద్రానికి చెందిన అహ్మద్ (14) ద్విచక్రవాహనంపై శ్రీపురం రోడ్డులో వెళ్తుండగా ఓ ప్రైవేట్ కళాశాల బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతన్ని జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సిఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లైన 15 రోజులకే వరుడు మృతి

- బొమ్మన్‌పల్లిలో విషాదఛాయలు

అచ్చంపేట రూరల్: వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. పెళ్లైన రెండు రోజులకే వరుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషాధకరమైన సంఘటన మండలంలోని బొమ్మన్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండె కృష్ణయ్య కుమారుడు వినోద్(26) హైదరాబాద్‌లో ఓ పడవల తయారీ కంపెనీలో ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన యువతి బేబితో ఈనెల 1న పట్టణంలోని దేవాలయంలో వివాహం చేసుకున్నారు. ఈనెల 2న గ్రామం నుంచి అచ్చంపేటకు కులపెద్దలను ఆటోలో తీసుకుని వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే వినోద్‌ను వెల్దండ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పెళ్లి అయిన 15 రోజుల్లోనే వరుడు మృతి చెందడంతో ఇరువురి ఇళ్లలో విషాదఛాయలు నెలకొన్నాయి. బుధవారం సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండ సమీపంలోని ఓ పారాబాయిల్డ్ రైస్‌మిల్‌లో మంగళవారం చోటు చేసుకోగా బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మణికొండకు చెందిన బొంగులక్ష్మణ్ (35) నాగనూలు చెందిన బచ్చమ్మను 16ఏళ్ల క్రితం వివాహం చేసుకుని నెల్లికొండ సమీపంలోని ఓ పారాబాయిల్డ్ రైస్‌మిల్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న భార్యతో గొడవపడి ఆమెను కొట్టడంతో తలకు తీవ్ర గాయామైంది. దీంతో మనస్తాపానికి గురైన అతడు రైస్‌మిల్‌లో ఉరేసుకున్నాడు. రైస్‌మిల్ యజమాని బుధవారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యాభర్తల గొడవ అడ్డుకోబోయిన వ్యక్తిపై దాడి

ధరూరు : భార్యాభర్తలు తరచుగా గొడవ పడుతుంటే ఎందుకు కొట్లాడుతారని అడ్డుకోబోయిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండల పరిధిలోని నెట్టెంపాడులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ బోడి శివన్న తాగొచ్చి తరచుగా తన భార్యను కొట్టేవాడు. మంగళవారం అదే తరహాలో భార్యపై దాడి చేశాడు. ఇంటి పక్కన ఉన్న కుర్వ మహదేవ్ వారి కొట్లాటను వారించేందుకు వెళ్లాడు. దీంతో 'నువ్వెడివిరా' అంటూ కట్టెతో అతనిపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. బుధవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

క్రీడల్లో వనపర్తికి మంచిపేరు



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- పెబ్బేరులో అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

పెబ్బేరురూరల్: అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పీజేపీ క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మంత్రి, కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ ప్రారంభించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించి షీల్డ్‌లను బహుకరించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన జిల్లా వనపర్తి అని తెలిపారు. ఇక్కడ శ్రీరంగాపూర్, రంగాపూర్, బీచుపల్లి, జూరాల వంటి ప్రాంతాలను సందర్శించడంతో ఈ ప్రాంతాలు మీ మదిలో గుర్తుండిపోవాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడా సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తున్నందుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. క్రమశిక్షణతో ఆటలు ఆడితే నైపుణ్యం, సామర్థ్యం పెరుగుతుందని, ఏ ప్రాంత్రంలో వెళ్లి టోర్నమెంట్‌లో పాల్గొన్నా జ్ఞాపకాలు ఉండిపోతాయని, వనపర్తి జిల్లా నుంచి అందరూ తీపిజ్ఞాపకాలతో వెళ్లాలని ఆకాంక్షించారు. ఇక్కడ వంటకాలు చాలా బాగుంటాయని, అదేవిధంగా చూడాల్సిన ప్రాంత్రాలు సైతం ఉన్నాయని తెలియజేస్తూ దేశంలో పేరుగాంచిన గొప్ప ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారని అందులో సునీల్ చత్రి ఒకరిని అతని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్లు, కమిషనర్ ఆదిశేషు, జిల్లా క్రీడా శాఖల అధికారి సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మైదానంలో తలపడుతున్న జట్లు

తొలిరోజు ఫలితాలు..

తొలి రోజు 5 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇందులో మెదక్, కరీంనగర్ మధ్య 1-0తో కరీంనగర్‌పై మెదక్ విజయం సాధించింది. గోల్ స్కోరర్ మెదక్ సాద్ 15వ నిమిషం, రెండో మ్యాచ్ మహబూబ్‌నగర్ - రంగారెడ్డిపై 1-0 తేడాతో మహబుబ్‌నగర్ విజయం సాధించడంతో గోల్ స్కోరర్ రంగారెడ్డి, జూషువా 33వ నిమిషం, మూడో మ్యాచ్ ఆదిలాబాద్ - వనపర్తి 3-1 తేడాతో ఆదిలాబాద్ ఓడింది. ఆజాజ్ 17వ నిమిషాలు, విజయ్ 35వ నిమిషం, కిశోర్ 51 నిమిషాలు, గోల్ స్కోరర్ ఆదిలాబాద్ కోసం లక్ష్మణ్ 49వ నిమిషాలు, నాల్గవ మ్యాచ్ ఖమ్మం -నల్లగొండలో ఖమ్మం జట్టు 3-2 తేడాతో నల్లగొండ గెలిచింది. విల్సన్ 14వ నిమిషంలో, గోపిచంద్ 22వ నిమిషంలో అశ్రిత్ 51 నిమిషాల గోల్ స్కోరర్ నల్గొండ సాగర్ 7వ నిమిషం, సాగర్ 88వ నిమిషం, ఐదవ మ్యాచ్ నిజామాబాద్ - కరీంనగర్ 40వ నిమిషాల్లో కరీంనగర్ తరపున 1-0 గోల్ స్కోరర్‌తో నిజామాబాద్‌ని ఓడించిందని మిగిత టీమ్‌లు గురువారం ఆడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గ్రౌండ్‌లో జెండాను ఎగరవేస్తున్న కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకుల దుర్మరణం, ఒకరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన బస్సు



తెలుగు కుమార్ (ఫైల్)



హరిజన్ మహేష్ (ఫైల్)

చిన్నచింతకుంట: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కురుమూర్తి గ్రామానికి చెందిన తెలుగు కుమార్ (28), హరిజన్ మహేష్(24), హరిజన్ గోపాల్ మోపెడ్ బండిమీద మదనాపురం మండలం కొన్నూర్ వెళ్లి తిరిగి వస్తుండగా అమ్మపురం సమీపంలో కురుమూర్తి స్వామి దేవస్థానం నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తెలుగు కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్, గోపాల్‌కు తీవ్ర గాయాలుకావడంతో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో మహేష్ మృతి చెందాడు. గోపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు, తెలుగు కుమారుకు భార్య ఉంది. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ శేఖర్ చేరుకుని పరిశీలించారు.

పోలీసులతో వాగ్వివాదం..

ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, కురుమూర్తి గ్రామస్తులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఎస్‌ఐ శేఖర్ ఆర్టీసీ ఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. సంఘటన స్థలం వద్ద దేవరకద్ర, అడ్డాకుల ఎస్‌ఐ వెంకటేష్, మాధవరెడ్డి పర్యవేక్షించారు.

మోసం చేసిన వ్యక్తులపై ఫిర్యాదు

పెబ్బేరు రూరల్: పొట్టేళ్ల డబ్బులు ఇస్తామని చెప్పి మోసం చేసిన వ్యక్తులపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వనపర్తిరూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం .. వనపర్తి మండలంలోని పెద్దగూడెం చెందిన కటిక భారతయ్య గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన మీర్ మగ్దుదూమ్ అలిఖాన్, మహ్మద్ ఫయాజుద్దీన్ జూన్ 24న రూ.11వేల చొప్పున 100 పొటేళ్లు భారతయ్య వద్ద కొనుగోలు చేశారు. వీటికి మొత్తం రూ.11 లక్షలు కాగా, రూ.3లక్షలు ఇచ్చి మిగతావి జూలై 31న ఇస్తామని చెప్పారు. వారు సమయానికి డబ్బులు ఇవ్వకుండా హైదరాబాద్‌లో వారి ఇళ్లకు వెళ్లి ప్రశ్నించగా, చంపుతామని బెదిరించారని తెలిపారు. బాధితుడు కటిక భారతయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు

ఉండవెల్లి: మాటమాట పెరిగి వ్యక్తిపై ముగ్గురు దాడి చేయడంతో వారిపై కేసు నమోదైన ఘటన మడలంలోని కంచుపాడు బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు కథనం ప్రకారం.. కంచుపాడులో ఈ నెల 14న గోవిందు రచ్చబండపై కూర్చొని ఎల్లన్న, మల్లన్నలను కూలిపనికి ఎందుకు వస్తలేరని తిడుతున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న బోయ మద్దిలేటి, రామానాయుడు, నరసింహులు కలిసి గోవిందుతో వాగ్వివాదానికి దిగారు. మాట మాట పెరిగి గోవిందు తలపై ముగ్గురు రాయితో దాడి చేశారు. బుధవారం బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు, హత్యగా మార్పు

జడ్చర్ల: స్థానిక పాతబజార్‌కు చెందిన జీనుగ బాలయ్య(30) తన ఇంట్లో సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందిన కేసును హత్యగా నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు మొదటగా అనుమానాస్పదంగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో బుధవారం విచారించి హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఇద్దరు బాలికలపై లైంగికదాడి

జడ్చర్ల: మండలంలో ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన రాజుపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. అదేవిధంగా మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన మరో వ్యక్తి రాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తప్పిపోయిన పీటీజీ విద్యార్థి



కళాశాల మైదానంలో తల్లిదండ్రులు, బంధువులు

మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థి కళాశాల నుంచి తప్పిపోయిన ఘటన బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలం రంగాపూర్ చెందిన బాలు కుమారుడు వరుణ్ పీటీజీ కళాశాలలో ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో మొలకల పండగ ఉన్నందున వెళ్లి తిరిగి అదే రోజు (బుధవారం ఉదయం) కళాశాలకు వచ్చినట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనం చేసినప్పుడు ఉన్న విద్యార్థి సాయంత్రం డ్రిల్ సమయంలో హాజరు తీసుకున్న ఉపాధ్యాయులకు కనిపించలేదు. కళాశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రుల సూచన మేరకు మద్దిమడుగులో ఉండవచ్చుననే అనుమానంతో కళాశాల సిబ్బంది అక్కడికి వెళ్లారు. రాత్రి 9:30 గంటల వరకు ఎలాంటి సమాచారం తెలియరాలేదు. కళాశాల నుంచి విద్యార్థి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రాణాలు తీసిన ఫాంపాండ్

- కూతుర్ని కాపాడుబోయి నీటిలో పడిపోయిన తల్లి
- ఘటనలో తల్లీకూతురు మృతి

జడ్చర్ల: కూలి పనులే జీవనాధారంగా బతుకున్న ఓ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. ఫాంపాండ్ (నీటి నిల్వ గుంత)లో ప్రమాదవశాత్తు పడిన తన రెండేళ్ల చిన్నారిని కాపాడబోయిన తల్లి నీటిలో మునిగి మృత్యువాత పడిన సంఘటన మండలంలోని గొల్లపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ చెందిన శంకరయ్య గొల్లపల్లి శివారులో గల తన వ్యవసాయ పొలంలో మామిడితోటలో నెల క్రితం భార్యాభర్తలు శ్యామ్‌రావు, సుజాత(25) పనికి కుదిరారు. వీరికి రెండేళ్ల కూతురు నర్సమ్మ ఉంది. బుధవారం ఉదయం 11 గంటలకు సుజాత తన దుస్తులు ఉతికేందుకు ఫాంపాండ్ దగ్గరకు వెళ్లింది. ఆమె వెంటనే తన కూతురు కూడా ఆడుకుంటూ వచ్చింది. నీళ్ల చేతికి అందే విధంగా కట్టపై కూర్చుని దుస్తులు ఉతుకుతుండగా తన పక్కనే ఆడుకుంటున్న కూతురు నర్సమ్మ అకస్మికంగా నీటిలో పడిపోయింది. తల్లి వెంటనే తన కూతురును రక్షించేందుకు చేసిన ప్రయత్నంలో ఆమె కూడా ప్రమాదవశాత్తు నీటిలోకి జారిపడింది. కొద్ది సేపటి తర్వాత తన కూతురును వెతుకుతు వచ్చిన శ్యాంరావుకు నీటిలో తేలియాడుతున్న కూతురు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే తన కూతురును నీటి నుంచి బయటకు తీసి చూడగా మృత్యువాత పడింది. తేరుకుని తన భార్య సుజాత కోసం వెతుకగా ఎక్కడా కనిపించలేదు. అనుమానంతో నీటిలోకి దిగి చూడగా అడుగున తన భార్య కనించడంతో బయటకు తీసి చూడగా అప్పటికే ఆమె మరణించింది. విషయం తన బంధువులకు చెప్పడంతో సుజాత తల్లి వెంకటమ్మ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని లబోదిబోమన్నారు.



మృతదేహాల వద్ద విలపిస్తున్న భర్త, బంధువులు

సుజాత మూడో భార్య...

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా నుడిగుందకు చెందిన శ్యామ్‌రావుకు మృతురాలు సుజాత మూడో భార్య. మొదటి భార్య ప్రసవ సమయంలో చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకోగా ఆమె గొడవ పడి విడిచి వెళ్లింది. ఉపాధి నిమిత్తం జడ్చర్ల ప్రాంతానికి వచ్చిన శ్యామ్‌రావు పోలేపల్లికి చెందిన సుజాతను మూడో పెళ్లి చేసుకున్నాడు. అయితే విధి వక్రించి మూడో భార్య కూడా కన్నుమూయడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

కేకలు వేస్తే ప్రాణాలు నిలబడేవి..

ఫాంపాండ్‌లో దాదాపు 12 అడుగుల మేరకు నీళ్ల ఉండడంతో పాటు చుట్టూ ప్లాస్టిక్ కవర్ కలిగి జారుడు స్వభావం ఉండడం ప్రమాదానికి కారణంగా భావించవచ్చు. చిన్నారి నీటిలో పడిన వెంటనే గట్టిగా కేకలు వేసి ఉంటే 20 అడుగుల దూరంలో పనులు చేస్తున్న వ్యక్తి వచ్చి కాపాడే పరిస్థితి ఉండేదని అక్కడి వారు తెలిపారు. ఆందోళనలో అన్ని మరిచిపోయి కాపాడే ప్రయత్నంలో కూతురుతో పాటు తల్లి ప్రాణాలు కోల్పోవడం అక్కడి వారిని కలిచివేసింది.

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం



బోయిన్‌పల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాహిత పాదయాత్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు మల్లాపూర్, బోయిన్‌పల్లిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పోరాటం చేయడం వలన సీఎం కేసీఆర్ దిగొచ్చి రైతుల రుణమాఫీ చేశారని అన్నారు. మండల కేంద్రంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 450 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, బీఆర్‌ఎస్ 9ఏళ్ల కాలంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయని విమర్శించారు. మండల కేంద్రంలో కేవలం కొత్తగా 94 మందికి మాత్రమే ఆసరా పింఛన్లు ఇచ్చారని, 300మంది దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు పింఛన్లు, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ప్రజలు ఆశీర్వదించి పార్టీని అధికారంలోకి తేవాలని కోరారు. ఎస్సీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో ఉండడంతో విద్యార్థినులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందులు ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారని, కొత్తగా బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదన్నారు. ఆయన వెంట రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సంపత్, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రశాంత్, బంగారు, అయ్యన్న, నర్సింహ, ఉస్మాన్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో నగదు, బంగారం చోరీ

జడ్చర్ల: పట్టణంలో మంగళవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. స్థానిక 25వ వార్డులోని రాజీవ్‌నగర్ కాలనీలో ఆలూరు చెందిన నిరంజన్‌గౌడ్ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లాడు. తిరిగి రాత్రి 10:30గంటలకు ఇంటికి చేరకోగా తాళం పగులగొట్టి ఉండండతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు విరగ్గొట్టి అందులో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారురాభరణాలు, 35 తులాల వెండి నగలు అపహరించినట్టు గుర్తించాడు. అదేవిధంగా పక్కనే నివాసం ఉంటున్న శివకుమార్ ఇంటికి తాళం వేసి పని నిమిత్తం ఊరెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంటికి చేరుకోగా ఇంటి తాళం విరగ్గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా తులంన్నర బంగారు ఆభరణంతో పాటు 60 తులాల వెండి, ల్యాప్‌ట్యాప్, మూడు సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం/నవాబుపేట: యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి, గర్భవతి అయ్యాక మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ వివరాలను వెల్లడించారు. నవాబుపేట మండలం రుద్రారం చెందిన మహేందర్ అదే గ్రామానికి చెందిన యువతిని మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. దీంతో ఆమె విషయం అతనికి చెప్పడంతో తనకు సంబంధం లేదన్నాడు. బాధితురాలు 2017 ఫిబ్రవరి 5న నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి రూరల్ సీఐ రామకృష్ణ చార్జిషీట్ దాఖలు చేశారు. బాధితురాలు ప్రసవం కావడంతో తల్లి, బిడ్డతో పాటు మహేందర్ డీఎన్‌ఏ పరీక్షకు పంపడంతో పాపకు తండ్రి మహేందర్ అని తేలింది. మహేందర్ నేరం అంగీకరించక పోవడంతో ఈ కేసు బుధవారం జిల్లా మహిళ న్యాయస్థానానికి రావడంతో న్యాయమూర్తి కేసు వాదనాలు విన్న తర్వాత పదేళ్ల కఠిన కారాగార శిక్షతో, రూ.6వేల జరిమానా, రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. దీంతో పాటు బాధితురాలికి రూ.7లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

జెన్‌కోలో నిలిచిన విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 11వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 6వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపుల ద్వారా నీటి పంపింగ్ కొనసాగిస్తున్నారు. నీటి కొరత కారణంగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 115, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాల్వకు 620, సమాంతర కాల్వకు 850, భీమా లిప్టు -2కు 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.631 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 862.0 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 862 అడుగుల నీటిమట్టం, 112.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 12వేలు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 6.639 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 12,887 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 315 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.



నెట్టెంపాడు లిఫ్టు-2లో కొనసాగుతున్న నీటి పంపింగ్

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, సమాంతర సెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. భీమా ఫేజ్-2 ద్వారా 212 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

కోయిల్‌సాగర్‌లో 27.4..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రం వరకు 27.4 అడుగులకు నీటి మట్టం చేరింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకంలో ఒక మోటార్ ద్వారా 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా యాసంగి పంటలకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా, మరో 5.2 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లను తెరిచే అవకాశం ఉంది.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి మా క్లయింట్స్ 1.చిన్నకర్మల మణెమ్మ భర్త రాంరెడ్డి, 2.చిన్నకర్మల యశోద భర్త లేట్ రాఘవరెడ్డి, 3.చిన్నకర్మల శివారెడ్డి తండ్రి లేట్ కిష్టారెడ్డి, 4.చిన్నకర్మల తిరుపతిరెడ్డి తండ్రి లేట్ కిష్టారెడ్డి, 5.చిన్నకర్మల సాయిరెడ్డి తండ్రి లేట్ గోపాల్‌రెడ్డి, 6.చిన్నకర్మల సుశీల భర్త మన్నెం కొండారెడ్డి, 7.చిన్నకర్మల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి లేట్ గోపాల్‌రెడ్డి, 8.చిన్నకర్మల మోహన్‌రెడ్డి తండ్రి లేట్ గోపాల్‌రెడ్డి, 9.చిన్నకర్మల వెంకట్‌రెడ్డి తండ్రి లేట్ గోపాల్‌రెడ్డి, 10.చిన్నకర్మల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి లేట్ బాల్‌రెడ్డి, 11.చిన్నకర్మల నాగిరెడ్డి తండ్రి లేట్ బాల్‌రెడ్డి, 12.చిన్నకర్మల నవీన తండ్రి లేట్ రాంరెడ్డి, 13.చిన్నకర్మల సతీష్ తండ్రి లేట్ రాంరెడ్డి అందరి నివాసం వనపర్తి జిల్లా, కొత్తకోట గ్రామం & మండలం గార్ల తరుపున తెలియజేయడం ఏమనగా, వీరికి చిన్నకర్మల సాయన్న గారి ద్వారా వనపర్తి జిల్లా, కొత్తకోట మం॥ & గ్రా॥ శివారు పరిధిలోని సర్వే నం.335లో ఎ॥ 5-04 గుం॥, సర్వే నం.339లో ఎ॥ 7-23 గుం॥, సర్వే నం.352/1లో ఎ॥ 10-03 గుం॥ & సర్వే నం.352/2లో ఎ॥ 2-10 గుం॥ భూమికి రక్షిత కౌలుదారు వారసత్వపు హక్కులు కలిగి ఉన్నారు. మా క్లయింట్స్‌కు రక్షిత కౌలుదారులుగా సంపూర్ణ టెనెంట్ హక్కులు కలవని గౌరవనీయ అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) వనపర్తి గారు టెనెంట్ కేసు నం.F1/A-01/2018/File No.F/447/2018 లో కూలంకషంగా విచారణ చేసి తీర్మానించి, కొత్తకోట తహసీల్దార్ గారికి వనపర్తి జిల్లా, కొత్తకోట మం॥ & గ్రా॥ శివారు పరిధిలోని సర్వే నం.335లో ఎ॥ 5-04 గుం॥, సర్వే నం.339లో ఎ॥ 7-23 గుం॥, సర్వే నం.352/1లో ఎ॥ 10-03 గుం॥ & సర్వే నం.352/2లో ఎ॥ 2-10 గుం॥ (రాఘవేంద్ర కాలని) ఖాళీ భూమిని స్వాధీనం చేయమని మరియు అందులో నిర్మించబడిన నిర్మాణాలను Telangana Tenancy & Agrl Lands Act,1950 ప్రకారంగా చర్యతీసుకొని మా క్లయింట్స్‌కు స్వాధీనం చేయమని ఆదేశించినారు. పై చూపబడిన మా క్లయింట్స్‌కు టెనెంట్ చట్ట ప్రకారం సర్వ హక్కులు ఉన్న భూమిపై కొంత మంది ఎలాంటి హక్కులు లేకుండానే మోసపూరితంగా ఇతరులకు అమ్ముచూపుతున్నట్లు మరియు నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిసింది. కావున ఇట్టి భూములకు సంబంధించి ఎలాంటి క్రయవిక్రయాలు జరిగిన మరియు నిర్మాణాలు జరిగిన Telangana Tenancy & Agrl Lands Act,1950 ప్రకారం చెల్లనేరవు మరియు మా క్లయింట్లు తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

పి.శ్రీరాంరావు, పి.మన్మోహన్ రావు, పి.వనజాదేవి,
టి.శిరీష్‌చంద్ర ప్రసాద్, ఎస్.రమేష్, పి.రఘువంశి, ఎ.భరత్‌కుమార్,
న్యాయవాదులు, వనపర్తి. సెల్ : 9440465174, 9396800343

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
Badangpet-Nadargul HMDA Approved 2 & 3BHK Luxury Flats, Flash Lauching Offer only 3 Days, Pay only 50% Now & Balance after 1 year with Amenities. Ph: 8006638238.

SERVICES

CHANGE OF NAME
I, MALLIKARJUN (Old Name) H.No. 2-93, Appakapally, Narayanpet, Hence Changed my Name as AVUTI MALLIKARJUN S/o. AVUTI JAYAPRAKASH (New Name)

WANTED
- రేమండ్ షోరూం, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంచార్జ్, సేల్స్ ఇంచార్జ్ కావలెను. సెల్:9492801999, 08543796888.
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 13000/- ఇయస్ఐ, పిఎఫ్ వసతి, భోజనం ఉచిత సౌకర్యం. ఫోన్ : 6300661014.
- ప్రముఖ హాస్టల్ జడ్చర్లలో పనిచేయుటకు లేడి వంటమనిషి మరియు స్వీపర్ కావలెను. పని వేళలు ఉ॥2 గంటలు, సా॥ 2 గంటలు. సంప్ర॥ 7013505150
- బేపెల్లి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 18K, ఏజెంట్ బేసిక్‌18K ఫోన్: 9640400073

GRANITE MACHINES FOR SALE
a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.
b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.
7397741830
BANGALORE

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు డ్రాఫ్ట్‌ల్ / చెక్‌ల చెల్లింపు చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్

అంతా 'సార్' చెప్పినట్లే..

బయటపడ్డ పుంగనూరు మర్డర్ ప్లాన్ • పుంగనూరులో పోలీసుల్ని చంపాలి.. అల్లకల్లోలం సృష్టించాలి

- పోలీసుల ఎదుట నోరు విప్పిన చల్లా బాబు డ్రైవర్ నవీన్‌కుమార్
- పోలీసులు కేసు పెడితే కోర్టులో మన 'సార్' చూసుకుంటాడు
- టీడీపీ నేతల రహస్య సమావేశంలో చల్లా బాబు ఆదేశాలు
- అంతకుముందు అంగళ్లులో చంద్రబాబుతో చల్లా బాబు భేటీ
- అన్నీ 'సార్' ఆదేశాల మేరకే..


పుంగనూరు వద్ద టీడీపీ మూకల దాడి (ఫైల్)

చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో పోలీసులను చంపాలన్న కుట్ర, వాహనాలను తగులబెట్టడం, వ్యూహ ప్రతివ్యూహాలన్నీ 'సార్'కు తెలిసే జరిగాయా? ఈ విధ్వంసకాండంతో సొంత పార్టీ కార్యకర్తల్ని సైతం బలిదానం తీసుకోవాలని 'సార్'నుంచి ఉత్తర్వులు వచ్చాయా? పోలీసులు కేసు పెడితే కోర్టులో కాపాడే విషయం కూడా 'సార్'చూసుకుంటారని స్పష్టమైన హామీ లభించిందా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈనెల 4వ తేదీన పుంగనూరు వద్ద జరిగిన విధ్వంసకాండతో పదుల సంఖ్యలో పోలీసులపై హత్యాయత్నం జరగడం, వాహనాలు తగులబెట్టిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు పరారీలో ఉండగా.. ఇతని డ్రైవర్ కలకడ నవీన్ కుమార్, మరో ఇద్దరు నిందితులు దోవల అమర్‌నాథ్, సి.పెద్దన్నలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. చల్లా బాబు డ్రైవర్‌ను పోలీసులు విచారించగా ఈ కుట్రలకు సంబంధించిన పూర్తి ప్లాన్‌ను విస్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. నిందితుడి నేర ఒప్పుదల వాంగ్మూలంలో పలు విషయాలను పూస గుచ్చినట్లు చెప్పేశాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

1వ తేదీ : కుట్రకు రూపం

ఈ నెల 4వ తేదీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన పుంగనూరు బైపాస్ మీద వెళ్లాల్సి ఉండగా.. అనుమతి లేకున్నా పుంగనూరు పట్టణంలోకి వెళ్లడానికి టీడీపీ నేతలు పట్టుపట్టడం, ఆపై పోలీసులను చంపాలని విధ్వంసకాండ సృష్టించగా ఓ పోలీసు కంటిచూపు పోగొట్టుకోగా, పదుల సంఖ్యలో పోలీసులకు తలలు పగిలి రక్త గాయాలైన విషయం తెలిసిందే. ఈ కుట్రకు ఈనెల 1వ తేదీనే టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం చల్లా బాబు, ఇతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్ ముగ్గురూ రొంపిచెర్ల నుంచి పుంగనూరుకు కారులో బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లగానే చల్లా బాబు ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. 'సరే సార్.. సరే సార్.. మీరు చెప్పినట్లే చేస్తాను. బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లు అన్నీ అక్కడ డంప్ చేస్తాం. మిమ్మల్ని టౌన్‌లోకి రానివ్వమంటూ పోలీసులు చెప్పగానే మనవాళ్లు దాడి చేస్తారు. పోలీసులను కానీ, అవసరమైతే వైసీపీ వాళ్లపై దాడి చేసి చంపైనా సరే మీరు చెప్పినట్లే ప్రోగ్రాం పెట్టిస్తా సార్..'అని మాట్లాడినట్లు సమాచారం. మరుసటి రోజు తన ఇంటి వద్ద జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి పిలవాల్సిన కొందరి పేర్లను గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌కు చల్లా బాబు అప్పగించాడు.

2వ తేదీ : వ్యూహ రచన

రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారి పల్లె పంచాయతీ, గర్నిమిట్టవారిపల్లెలోని చల్లా బాబు ఇంటి వద్ద టీడీపీలోని ముఖ్యమైన నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. టీడీపీకి చెందిన హేమంత్‌రెడ్డి, మోహన్‌నాయుడు, నగేష్, రమేష్‌రెడ్డి ఇంకా పలువురు ముఖ్య నేతల్ని పిలిపించిన చల్లా బాబు మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇందులో రాళ్లు, మద్యం బాటిళ్లు, టపాకాయ బాంబులు, కర్రలు ఎక్కడ డంప్ చేయాలో చెప్పాడు. పోలీసులు కాల్పులు ఓపెన్ చేసేలా ఎలా రెచ్చగొట్టాలో ఆదేశాలిచ్చాడు. ఒకరిద్దరు ఖాకీల ప్రాణాలు పోతే.. టీడీపీ కార్యకర్తలు చేసే బలిదానం వల్ల పార్టీ మైలేజ్ పెరుగుతుందని నమ్మబలికాడు. ఇదే జరిగితే రాష్ట్రంలో అధికార పార్టీకి జరిగే డ్యామేజ్, టీడీపీకి వచ్చే మైలేజ్ గురించి వివరించాడు. ఎవరెవరు ఏ పనులు చేయాలో అప్పగించి, అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరగాలని చల్లా బాబు ఆదేశించాడని సమాచారం.

3వ తేదీ : వ్యూహం అమలుపై ప్లాన్

చల్లాబాబు మరికొంత మంది టీడీపీ నాయకుల్ని తన ఇంటి వద్దకు పిలిపించాడు. పుంగనూరు విధ్వంసకాండ ఎలా చేయాలి? పోలీసులను ఎలా చంపాలి? ఖాకీలు ఫైర్ ఓపెన్ చేసేలా రెచ్చగొట్టే విధానం? ఆపై జరిగే అల్లర్లలో ఎవరెవరి పాత్ర ఏమిటనే ప్లాన్ గురించి చెప్పాడు.

4వ తేదీ : వ్యూహం అమలు

ఉదయం 10 గంటలు కావస్తోంది. చల్లా బాబు అంగళ్లుకు వెళ్లారు. అక్కడ చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యాడు. ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఆపై చల్లా బాబు, అతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్‌తో కలిసి కారులో పుంగనూరు బయలుదేరారు. కారు మదనపల్లె దాటిన తర్వాత.. 'వీఐపీ కంటే మనం ముందుండాలి.. అక్కడ ఏం చేయాలో ముందుగా అనుకున్నట్లే అంతా జరగాలి' అని గోవర్ధన్‌రెడ్డిని చల్లా బాబు ఆదేశించాడు. 'అన్నా.. ఇదే జరిగితే పెద్ద గొడవలు జరుగుతాయి. పోలీసులు మనపై కేసులు పెడతారు. ఎట్టా అన్నా..'అని గోవర్ధన్‌రెడ్డి, చల్లా బాబును ప్రశ్నించినట్లు తెలిసింది. 'పోలీసులు పెట్టే కేసుల్ని కోర్టులో మన 'సార్'చూసుకుంటాడు..'అని చల్లా బాబు భరోసా ఇచ్చాడు. ఆపై జరిగిన విధ్వంసకాండలో చల్లా బాబు దగ్గరుండి మరీ టీడీపీ నేతల్ని రెచ్చగొట్టి.. పోలీసులను చంప్రేయండ్రా అంటూ, వాళ్ల వాహనాలను తగులబెట్టాలంటూ ఆదేశాలు ఇచ్చాడు.

ఇంతకూ ఆ సార్ ఎవరో?

పుంగనూరులో మారణహోమం సృష్టించాలనే ప్లాన్ వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరు? చల్లా బాబుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ఆ 'సార్'ఎవరు? వ్యవస్థలను మేనేజ్ చేయగలిగిన ధైర్యం ఉన్న ఆ 'సార్'ధైర్యమేమిటి? పోలీసులు ఆవేశంలో ఫైర్ ఓపెన్ చేసి వుంటే.. జరిగి ఉండే భారీ ప్రాణ నష్టానికి ప్రభుత్వాన్నే కూలదోసి సీఎం కుర్చీలో ఎక్కాలన్నదే ఆ 'సార్'లక్ష్యమా? మదిని తొలిచే ఈ ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తు సమాధానం చెప్పనుంది.

ఆర్టీసీలో మరోసారి 'కారుణ్యం'

- 1,538 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- మూడు దశల్లో నియామకాలు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధిని చాటుకుంటూ మరోసారి కారుణ్య నియామకాలకు ఏపీ ప్రభుత్వం అనుమతించింది. సర్వీసులో ఉండగా మరణించిన ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఊరట కల్పిస్తూ అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించనున్నారు. 2016 నుంచి 2020 జనవరి వరకు మృతి చెందిన 311 మంది ఆర్టీసీ సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే అనుమతించారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా 2020 జనవరి 1 నుంచి ఇప్పటివరకు మరణించిన ఆర్టీసీ సిబ్బంది వారసులకు కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. ఈమేరకు రెండో విడత కారుణ్య నియామకాలకు ఆర్టీసీ కార్యాచరణ చేపట్టింది.

మూడు దశల్లో..

2020 జనవరి 1 నుంచి 2023 ఆగస్టు 15 వరకు 1,538 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. ఆయా కుటుంబాల్లో అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద మూడు దశల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. మొదటి దశలో కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా కమిటీలు ఉద్యోగాలు కల్పిస్తాయి. ఆయా జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారిని నియమిస్తారు. జిల్లా కమిటీలు గుర్తించిన పోస్టులను భర్తీ చేయగా మిగిలిన వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పిస్తారు. అప్పటికీ ఇంకా అర్హులు మిగిలిపోతే వారికి మళ్లీ జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తారు. ఇప్పటికే మొదటి దశగా జిల్లా కమిటీల ద్వారా కారుణ్య నియామకాల ప్రక్రియను చేపట్టారు. మిగిలిన ఉద్యోగాల కల్పనకు కూడా ఆర్టీసీ సమాయత్తం అవుతోంది.

ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు

కారుణ్య నియామకాల కోసం ఆగస్టు 15 నాటికి ఆర్టీసీలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలను గుర్తించారు. రాష్ట్రంలో 12 ఆర్టీసీ రీజియన్ల వారీగా మొత్తం 715 ఉద్యోగాలను గుర్తించారు. వీటిలో డ్రైవర్ పోస్టులు 346, కండక్టర్ పోస్టులు 90, అసిస్టెంట్ మెకానిక్ పోస్టులు 229, ఆర్టీసీ కానిస్టేబుల్ పోస్టులు 50 ఉన్నాయి. కారుణ్య నియామకాల కింద ఈ పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేయాలని ఆర్టీసీ భావిస్తోంది.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- ఏపీలో రెగ్యులరైజేషన్‌కు ఐదేళ్ల సర్వీసు నిబంధన ఎత్తివేత
- స్వాతంత్ర్య దినోత్సవ వేళ సీఎం వైఎస్ జగన్ శుభవార్త
- 2014 జూన్ 2 ముందు నుంచి ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ రెగ్యులరైజేషన్



సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుభవార్త అందించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఐదేళ్ల సర్వీసు నిబంధనను ఎత్తివేస్తూ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ గత మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకు 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులనే రెగ్యులరైజేషన్ చేసేలా నిబంధన విధించారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్ ఐదు సంవత్సరాల నిబంధనను తొలగిస్తూ సంబంధిత ఫైలుకు మంగళవారం ఆమోద ముద్ర వేశారు. వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకుండానే స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును రెగ్యులరైజ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ ఖరారు

- గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
- 8 శాతం ఫిట్‌మెంట్.. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు

సాక్షి, అమరావతి: ఏపీ విద్యుత్ సంస్థల్లోని 28,355 కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తూ.. ఉద్యోగుల వేతన సవరణ (పీఆర్సీ) ఖరారైంది. కొత్తగా అమల్లోకి రానున్న సింగిల్ మాస్టర్ స్కేలుతో కూడిన పీఆర్సీ ఒప్పందంపై ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (ఏపీఈపీడీసీఎల్), (ఏపీసీపీడీసీఎల్), (ఏపీఎస్పీడీసీఎల్) ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులు, పలు యూనియన్ల నాయకులు బుధవారం సంతకాలు చేసి పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం కొత్త పీఆర్సీ గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పీఆర్సీ బకాయిలను విద్యుత్ సంస్థలు 12 వాయిదాల్లో ఉద్యోగులకు చెల్లిస్తాయి. అలాగేవారికి 8 శాతం ఫిట్‌మెంట్ లభిస్తుంది. సింగిల్ మాస్టర్ స్కేలు అనే కొత్త విధానాన్ని అమల్లోకి తేనున్న నేపథ్యంలో అధికారులు లోతుగా అధ్యయనం చేసి కొత్త స్కేళ్లు రూపొందించారు. పేస్కేళ్లలో తేడాలు ఉంటే సరిచేసేందుకు ట్రాన్స్‌కో జేఎండీ నేతృత్వంలో మూడు డిస్కంల సీఎండీలతో హెచ్ఆర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తూ పీఆర్సీ ఒప్పందంపై సంతకాలు చేశారు. యాజమాన్యాల తరఫున ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు.. పృథ్వీతేజ్, పద్మా జనార్దనరెడ్డి, సంతోష్ రావు, ఉద్యోగ సంఘాల తరఫున 1104, 327, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, జేఏసీ ప్రతినిధులు సంతకాలు చేసినవారిలో ఉన్నారు.

జీపీఎస్‌లో జీవిత భాగస్వామికీ పెన్షన్

ఆమోదించిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) విధానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ అందనుంది. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్టు తెలిసింది. త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. రిటైర్డ్ ఉద్యోగి నెలవారీ అందుకునే పెన్షన్‌లో 60 శాతాన్ని జీవిత భాగస్వామికి అందించాలని నిర్ణయించారు. యాన్యుటీలో ఏమైనా లోటు ఏర్పడితే ప్రభుత్వం భరించనుంది. దీంతో రిటైరైన ఉద్యోగి చనిపోయినా అతని భార్యకు పెన్షన్ భద్రత లభిస్తుంది. జీపీఎస్ వర్తించే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే.. వారు సర్వీసులో చివరి నెల మూల వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం ఇప్పటికే అంగీరించిన విషయం విదితమే. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తగ్గించడానికి ఆ మేరకు పెన్షన్ పెంపునకు జీపీఎస్‌లో అవకాశం ఉన్న విషయం విదితమే.

'నవోదయ' గడువు పెంపు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకై నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు మరోసారి పెంచినట్లు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తప్పులు సవరణ చేసుకోవడానికి దరఖాస్తు చివరి తేదీ అనంతరం రెండు రోజులు అవకాశం ఉంటుందని వివరించారు.

దొరికిన బంగారాన్ని అప్పగించిన విద్యార్థి



దేవరకద్ర రూరల్: అనుకోకుండా ఏదైనా దొరికితే చాలు గుట్టుగా దాచేసుకునే ఈ రోజుల్లో.. ఓ విద్యార్థి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గద్దెగూడెం చెందిన గోవు రాజు కుమారుడు గోవు బన్ని అదే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. పది రోజుల క్రితం బన్నీకి పాఠశాలకు సమీపంలో సుమారు రూ. లక్షన్నర విలువ చేసే బంగారు ఆభరణం దొరికింది. వెంటనే దానిని పాఠశాలలోని ఉపాధ్యాయులకు అందించాడు. విషయంపై పెద్దలకు సమాచారం ఇచ్చి గ్రామంలో విచారించారు. అది గ్రామానికి చెందిన కుంచేటి బాలకిష్టమ్మదని గుర్తించి, ఆమెను పాఠశాలకు పిలిపించి గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. పోయిన సొమ్ము దొరకడంతో బాధితురాలు ఎంతగానో ఆనందం వ్యక్తం చేసింది. విద్యార్థి నిజాయితీని మెచ్చుకొని, మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవంలో శాలువాతో సత్కరించి, రూ.2వేల నగదును అందించారు.

గృహహింస కేసులో జైలు శిక్ష

బిజినేపల్లి: గృహహింస కేసులో జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తు స్పెషల్ మొబైల్‌కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. తిమ్మాజిపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని గొరిటకు చెందిన శ్రీదేవి తన భర్త వెంకట ప్రవీణ్‌పై వేధింపులకు గురిచేస్తున్నాడని 2015లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా విచారణ చేసిన స్పెషల్ మొబైల్‌కోర్టు జడ్జి వెంకట ప్రవీణ్‌కు 18నెలల జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


యాగశాల వద్ద భక్తుల సందడి

- మూడో రోజు దిగ్విజయంగా కొనసాగిన మహోత్సవం
- పెద్దఎత్తున తరలివస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. శ్రీకృష్ణపీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుత చండీ అతి రుద్రం విశ్వశాంతి మహోత్సవంతో భక్తిభావం పెల్లుబికుతుంది. మూడవ రోజు బుధవారం అన్ని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. నిత్యపూజలతోపాటు ధన్వంతరి, నక్షత్ర, ధనలక్ష్మి హోమాలు, సాయంత్రం ధనలక్ష్మి పూజలు చేశారు.

నేటి హోమాలు

గురువారం నిత్య పూజలతోపాటు శ్రీలక్ష్మి, కుబేర, అష్టలక్ష్మి, ధాన్య లక్ష్మి హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఉమామహేశ్వర స్వామి కల్యాణం జరిపించనున్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

తరలివస్తున్న భక్తులు

14రోజుల పాటు దాదాపు రూ.20కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్న మహోత్సవానికి మూడవరోజు భక్తుల తాకిడి పెరిగింది. మొదటి రెండు రోజులు ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు. మరో 11రోజుల పాటు కొనసాగనున్న యాగమహోత్సవానికి భక్తుల తాకిడి రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి. అందుకు తగినట్లుగానే నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు.

ఈ ప్రాంతం సస్యశ్యామలం



యజ్ఞయాగాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది. విశ్వశాంతి యాగమహోత్సవం నిర్వహించటం ప్రాంతవాసులందరి అదృష్టం. నిత్యం హోమాలతోపాటు పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయడం వల్ల వాతావరణ కాలుష్యం తొలుగుతుంది. వాతావరణ సమతుల్యత ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరూ యాగ మహోత్సవంలో భాగస్వాములు కావాలి.

– బాదేపల్లి, శంకర్‌బాబు

విశ్వశాంతి సంకల్పంతోనే..



విశ్వశాంతి సంకల్పంతోనే 80వ యాగ మహోత్సవం నిర్వహిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 2వ అతి పెద్ద యాగంగా దీన్ని చెప్పుకోవచ్చు. 2014లో మహబూబ్‌నగర్ పట్టణంలో నా ఆధ్వర్యంలోనే నిర్వహించాను. మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ధన్యులు కావాలని ఆశిస్తున్నా. మొదటి మూడు రోజులు పూర్తయ్యాయి. మహోత్సవం పూర్తయ్యాక దేవతలందరి ఆశీస్సులతో ఈ ప్రాంతంలో ప్రజలు సుఖశాంతులతోపాటు సుభిక్షంగా ఉంటారు.

– కృష్ణజ్యోతి స్వరూపానంద, యాగ నిర్వాహకులు

'కురుమూర్తి'కి తరలివచ్చిన భక్తులు


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్వామి దర్శనానికి బుధవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో నైవేద్యం తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు.


జాతరమైదానంలో భక్తుల రద్దీ

అంజన్న నామస్మరణతో మార్మోగిన బీచుపల్లి



ఎర్రవల్లిచౌరస్తా: అమావాస్యను పురస్కరించుకుని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయం బుధవారం అంజన్న నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు అభయాంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృత అభిషేకం చేశారు. ఆలయ ధ్వజస్తంభం ఎదుట భక్తులు కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టినట్లు ఆలయ ఈఓ రామన్‌గౌడ్ పేర్కొన్నారు.

శ్రావణం.. శుభకరం


సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్)

- పండుగలకు నెలవైన మాసం
- నేటి నుంచి శ్రావణమాసం

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రావణ మాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల మొత్తం విశేష పర్వదినాలే. శివకేశవులకు ప్రీతికరమైన మాసం. హిందూ సాంప్రదాయం ప్రకారం పండుగలు ప్రారంభమయ్యేది ఈ శ్రావణం మాసం నుంచే. ఈ మాసంలో చేసే అన్ని పూజల్లోకెల్లా వరలక్ష్మి వ్రతం ఉత్తమమైనదంటారు. మొదట ఈ వ్రతాన్ని పరమేశ్వరుడు పార్వతీ దేవికి వివరించాడట. ఈనెల 20న నాగుల చవితి, 21న నాగుల పంచమి, 25న వరలక్ష్మి వ్రతం (రెండో శుక్రవారం), 31న శ్రావణ పౌర్ణమి (రాఖీ పండుగ), వచ్చేనెల 6న శ్రీకష్టాష్టమి వేడుకలు నిర్వహిస్తారు.

మంగళ, శుక్ర, శనివారాలకు ప్రాధాన్యత..

శ్రావణమాసంలోని మంగళ, శుక్ర, శనివారాలు అత్యంత పుణ్యప్రదమైనవి. మంగళవారాలు శ్రీగౌరి పూజకు, శుక్రవారాలు శ్రీలక్ష్మి పూజలు, శనివారాలు శ్రీమహావిష్ణువు పూజకు ముఖ్యమైన రోజులు. వీటికి తోడు శ్రావణ మాసంలోని శుక్లపక్షంలోగల పదిహేను రోజులు ఎంతో విశేషమైనవి. సకల ఉపచారాలతో నిష్టగా మహాలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. తొమ్మిది సంఖ్యకు ఈ వ్రతంలో ప్రాధాన్యత. అందుకే తొమ్మిది పోగులతో కూడిన తోరం ధరించి, తొమ్మిది రకాల పిండివంటలు లక్ష్మీదేవికి నివేదన చేసి ముత్తయిదువులకు వాయినమిస్తారు.

మహిమాన్వితం శ్రావణ పున్నమి..

శ్రావణమాసం పౌర్ణమి తిథిని ఎంతో మహిమ కలిగినదని శాస్త్రకారులు తెలిపారు. శ్రావణ పౌర్ణమికే జంధ్యాల పౌర్ణమి, నూలు పున్నమి పేర్లున్నాయి. గాయత్రి ఉపాసన చేసేవారు నూతన యజ్ఞోపవీతాలను ఇదే రోజున ధరిస్తారు. సర్వవిద్యా స్వరూపుడు అయిన హయగ్రీవుని జయంతి కూడా ఇదే రోజు. మకండ, విఖనస మహర్షుల జయంతి కూడా ఈ రోజే. రక్షా బంధన వ్రతం, రుషి తర్పణం వంటి వైదిక కర్మలు ఇదే రోజున ఆచరిస్తారు. ఎంతో మహిమాన్వితమైన ఈ తిథినాడు లక్ష్మీనారాయణులను, శివపార్వతులను, మహాలక్ష్మి, హయగ్రీవుడిని పూజిస్తే సత్ఫలితాలుంటాయని పురాణాలు చెబుతున్నాయి.

పరమపవిత్రం శ్రావణ మాసం



హిందువుల పరమ పవిత్రం శ్రావణ మాసం. ఈ మాసం పండుగలకు ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. ఈ మాసాన్ని నల మాసమని ఇంకొక పేరు. ప్రతి హైందవ ఇంట్లో ఈ నెలంతా పూజలు, వ్రతాలు నిర్వహిస్తుంటారు. దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, తులసి అర్చనలు, పుష్పార్చనలు, రుద్రాభిషేకాలు తదితర పూజలు చేస్తారు.

– గొంద్యాల రాఘవేంద్రశర్మ, మహబూబ్‌నగర్

ఎస్ఐలుగా ఎంపికైన వారికి సత్కారం


ఎస్ఐలుగా ఉద్యోగాలు పొందిన వారితో డీఐజీ సుమతి

అడ్డాకుల: ఉమ్మడి జిల్లాలో ఎస్ఐలుగా ఉద్యోగాలు సాధించిన పది మందిని హైదరాబాద్‌లో డీఐజీ సుమతి బుధవారం సత్కరించారు. అడ్డాకుల మండలం బలీదుపల్లికి చెందిన బి.తారకతో పాటు రక్షితారెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటేష్, కుమార్, ఇంద్రారెడ్డి, చంద్రశేఖర్, సతీష్‌కుమార్‌రెడ్డి, నరేష్, మధుసూదన్‌రెడ్డిలను ఉమెన్ సేఫ్టివింగ్ డీఐజీ సుమతి తన కార్యాలయానికి ఆహ్వానించారు. ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించి కేక్ తినిపించారు. ఉద్యోగంలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలతో స్నేహంగా మెలగాలని సూచించినట్లు బలీదుపల్లికి చెందిన తారక తెలిపారు.